ప్రజాశక్తి

గురువారం 25 జులై 2024

5

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



కమిషనర్ సూర్యతేజ బాధ్యతలు స్వీకరణ

నెల్లూరు సిటీ: ప్రతి అడుగు అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం వైపే నని... స్వచ్ఛమైన పాలనే లక్ష్యంగా పనిచేస్తానని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ మల్లవరపు సూర్య తేజ పేర్కొన్నారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు సమక్షంలో వేదపండితులు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా పాలన అం దించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలనుంచి ప్రతిరోజూ అర్జీలు స్వీకరిస్తానని తెలిపారు. నగర పాలక సంస్థ అన్ని విభాగాలతో సమీక్షలు నిర్వహించి నగరాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. మంచినీరు, రోడ్లు, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతానన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ ను నగర పాలక సంస్థ అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది కలుసుకుని పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

ఆ అధికారులు మనకొద్దు..!

- టిడిపి పార్టీ పెద్దల నిర్ణయం
- బదిలీలపై సుదీర్ఘ చర్చలు
- తొలి జాబితా సిద్ధం
- వారంలో మరో సారి కూర్చుందాం..

అధికార తెలుగుదేశం పార్టీ తమ మార్కు రాజకీయాలకు తెరలేపింది. నూతన ప్రభుత్వంలో తమకు అనుకూలమైన అధికారులను నియమించుకోవడానికి కసరత్తు చేసింది. మంగళవారం రాత్రి విజయవాడలోని ఎన్‌టిఆర్ నగర్‌లో మంత్రి పి. నారాయణ నివాసంలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, టిడిపి అగ్రనేతలు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారుల బదిలీలపై ప్రధాన చర్చ సాగినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో ముఖ్యమంత్రి ఆదేశాలతో నేతలతో భేటీ చేశారు. ప్రధానంగా గత ప్రభుత్వంలో ఆ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారని భావిస్తున్న జిల్లా అధికారులను అక్కడ నుంచి తొలగించాలని నిర్ణయం తీసు కున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత ప్రభుత్వంలో ఇబ్బందుల పడ్డ అధికారులకు పెద్ద పీఠ వేయాలని చూస్తున్నారు. అధికారుల బదిలీల విషయంలో వాడీవేడి చర్చ సాగినట్లు తెలిసింది. మరో వారంలో మళ్లీ కూ ర్చొని బదిలీల ప్రక్రియ ముగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

టిడిపి అధికారంపై పట్టుబిగించింది. భారీ విజయాన్ని సొంతం చేసుకున్న ఆపార్టీ అధికారులను పక్షాళన చేయాలని నిర్ణయం తీసుకుంది. నిన్నటి వరకు బదిలీ విషయంలో నువ్వా, నేనా అంటూ లడాయి పెట్టుకున్న నేతలంతా ఒక్కచోట కూర్చొని మంతనాలు జరిపారు. అసెంబ్లీ సమావేశాలకు హజరైన జిల్లాకు చెందిన మంత్రులు, ఎంఎల్‌ఎలు సిఎం ఆదేశాలతో మంగళవారం మంత్రి పి. నారాయణ నివాసంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎంఎల్‌ఎలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరు నాగేశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఉదయగిరి ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌కు జ్వరం కారణంగా రాలేదని తెలిసింది. ప్రధానంగా జిల్లాలో అధికారుల బదిలీలా అంశంపై చర్చ సాగింది. ఇప్పటికే జిల్లా అధికారులు మంత్రులు, ఎంఎల్‌ఎలు, పార్టీ నేతలతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తమను ఇక్కడే ఉంచాలని కొందరు.. మంచి ప్రదేశానికి బదిలీ చేయాలని మరి కొందరు కలిశారు.



ఎవరికి వారు నిర్ణయం తీసు కోకుండా అందరూ కూర్చొని ఒక నిర్ణయానికి రావాల పార్టీ అధిష్టానం ఆదేశించినట్లు తెలిసింది. వైసిపి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారని, కొందరి ఎంఎల్‌ఎలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పినట్లు కొందరు అధికారులు పనిచేశారని, వారు ఎట్టి పరిస్థితుల్లో వద్దని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గట్టిగా మట్లాడినట్లు సమాచారం. కోవూరు నియోజకవర్గంలో మాజీ ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి అనుకూలంగా ఇరిగేషన్ అధికారులు పనిచేశారని, మలిదేవి డైన్‌లో అక్రమాలు జరిగాయని, వారిని వదల కూడదని, చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పార్టీ నేతల దృష్టికి తీసుకొచ్చారని సమాచారం. కొందరు ఎంఎల్‌ఎలు కొందరి అధికారులకు మద్దతుగా నిలవగా, మరికొందరు వద్దని నివారించినట్లు తెలిసింది. తొలి దశలో గత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన అధికారులందరినీ పక్కన పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో ప్రధానంగా డిఆర్‌డిఎ , డ్వామా పీడీ, , హౌసింగ్, ఐటిడిఎ ఎస్‌సి కార్పొరేషన్, మెప్మా పీడీలతోపాటు, డిపిఒలను మరికొందరి అధికారులను బదిలీ చేయించాలని, గత ప్రభుత్వంలో ఇబ్బందిపడ్డ అధికారులను ఇక్కడకు తీసు కురావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అనేక మంది అధికారులపై అంశంపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఒకరో, ఇద్దరో నిర్ణయం కాకుండా మంత్రులు, ఎంఎల్‌ఎలు, పార్టీ నేతలు కలిసి నిర్ణయం తీసుకుని ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలని నిర్ణయం చేసినటట్లు తెలిసింది. మరో వారంలో మళ్లీ ఒకసారి కూర్చొని మిగిలిన అధికారుల బదిలీలు, కొత్త పోస్టింగ్‌ల విషయం మాట్లాడుకోవాలని తీర్మానించినట్లు తెలిసింది. ఈ పరిణామాలతో అధికారుల్లో గుబులు మొదలైయింది. ఎవరు ఉంటారో, ఎవరు వెళతారో చూడాలి. అధికారులు కూడా ఏక్కడైనా మాకు ఒక్కటే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

కేంద్ర బడ్జెట్‌పై సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు :కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని ద్రోహం జరిగిందని, రూ. 15 వేల కోట్ల రుణభారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపిందని సిపిఎం నగర కమిటీ విమర్శించింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపుల్లో అన్యాయం చేసిందటూ బుధవారం సిపిఎం నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన చేపట్టారు. గాంధీబొమ్మ చుట్టు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్ రావు, నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సమావేశంలో ప్రత్యేక హోదా ఊసేలేదన్నారు.విభజన చట్టం ప్రకారం నిధులు కేటాయింపు బడ్జెట్‌లో చోటు చేసుకొలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను వదిలి బిజెపికి టిడిపి, జనసేన భజన చేస్తున్నాయన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అప్పుల రూపంలో మంజూరు చేసిన నగదును నిధులు మంజూరుగా ప్రచారం చేయడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తున్న, మెజారిటీ సభ్యులు కలిగి ఉన్న టిడిపి,జనసేన పార్టీల నాయకులు రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం అన్న ప్రస్తావన తీసుకెళ్లలేపోయారన్నారు. విభజన చట్టంలో హామీల మేరకు నామ మాత్రంగా కూడా నిధులు కేటా యింపు జరగలేదన్నారు.15 వేల కోట్ల అప్పు అదనంగా మోపుతూ నిధులు సాధిం చినట్టు ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. బిజెపి భజన మాని రాష్ట్ర ప్రయో జనాల కోసం టిడిపి, జనసేన నిలబడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల అప్పు ప్రకటించడం దుర్మార్గం దీన్ని గ్రాంట్ గా రాష్ట్రానికి అందజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల కేటాయింపు, కడప స్టీల్ పరిశ్రమ నిర్మాణం, రామాయపట్నం ఓడరేవు నిర్మాణం, విశాఖపట్నం రైలే జోన్ నిర్మాణం వంటి అంశాలను ప్రసాతవిం చకపోవడం దారుణ మన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొన సాగిస్తామని, ప్రయివేటీకరణ చేసేది లేదని ప్రకటించక పోవడం దుర్మార్గ మన్నారు. కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆహార ధాన్యాలు, ఎరువులు ,పెట్రోలు, డీజీలు, గ్యాస్ సబ్సిడీలపై కోత విధించడం శోచనీయమన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వానికి భజన చేయడం మానుకొని విభజన చట్టంలోని హామీలను అమలు జరిపేందుకు ,నిధులు రాబట్టేందుకు టిడిపి, జనసేన కషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగేశ్వరావు, పి. సూర్యనారాయణ నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, షేక్. రషీద్,కె. పద్మ, చిరంజీవి,చెంగయ్య శాఖ కార్యదర్శులు జాఫర్, బొమ్మ శ్రీధర్, సంపూర్ణమ్మ లు పాల్గొన్నారు.

3వ మైలు వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం

మూడో మైలు సెంటర్‌లో..

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని సిపిఎం నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై రూరల్ మూడో మైలు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో రాస్తా రోకో చేపట్టారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి అబ్దుల్ అజీజ్ మాట్లాడారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్థావించకపోవడం దారుణమన్నారు. విభజన హామీలు ఊసేలేదన్నారు. మోసపూరిత కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నామన్నారు.. ఇప్పటికైనా రాష్ట్రాన్ని ప్రత్యేక హెూదా ,విభజన హామీలు రాజధాని నిర్మాణానికి కేంద్ర నిధులు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రూరల్ కమిటీ సభ్యురాలు ఎస్‌కె రూబియా, శాఖ కార్యదర్శి ఎం.డి సర్తాజ్, సిపిఎం నాయకులు సుబ్బారెడ్డి, చెంచయ్య, రమణమ్మ మరియు సిపిఎం డివైఎఫ్ఐ ,మహిళా సంఘం, ఆవాజ్ తదితర సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం, ఎన్‌టిఆర్ చిత్రపటాలను చూపుతున్న దృశ్యం

వైసిపి అరాచక పాలనకు చరమగీతం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :వైసిపి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని టిడిపి తిరుపతి పార్లమెంట్ బిసి సెల్ ప్రధాన కార్యదర్శి మన్నెం జి తేంద్ర గౌడ్ పేర్కొన్నారు. బుధవారం తోటపల్లిగూడూరు సచివాలయంలో మాజీ సిఎం కీర్తిశేషులు నందమూరి తారక రామారావు, ప్రస్తుత సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ క ళ్యాణ్, సర్వేపల్లి నియోజకవ ర్గం శాసనసభ్యులు సో మిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి ఫోటోలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ సిఎం చంద్ర బాబు నా యుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివద్ధి చెందుతుంద న్నారు. చంద్రమోహన్ రె డ్డి సారథ్యంలో సర్వేపల్లి నియోజకవ ర్గం అభివద్ధిలో రాష్ట్రానికే రోల్ మో డల్ గా నిలుస్తుందని జితేంద్ర గౌడ్ పేర్కొన్నారు. బడ్జెట్లో కేంద్రం రా ష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వడంపై జి తేంద్ర గౌడ్ హర్షం వ్య క్తం చేశారు. టీడీపీ మాజీ ఎంపీటీసీ మన్నెం మధుసూదన్ గౌడ్, తె లుగు యువత నాయ కులు మన్నెం కిరణ్ కుమార్, మూగ రాజా, మన్నెం ప్రభా కర్, ఇంగిలేల మురళి, పంచాయతీ కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

జాషువాకు నివాళి

ప్రజాశక్తి-కందుకూరు : కవికోకిల గుర్రం జాషువా 53వ వర్థంతిని స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గ ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిం చారు. కందు కూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు పలువురు నాయకులు జాషువా చిత్రప టానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. సమాజాన్ని మేల్కొలిపేలా గుర్రం జాషువా రచనలు చేశారని, బడుగు బలహీన వర్గాలను చైతన్య పరచటంలో ఆయన పాత్ర కీలకమైనదని నేతలు పేర్కొన్నారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాయపాటి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య, రెబ్బవరపు మాల్యాద్రి, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, ముచ్చు శ్రీను, బద్దిపూడి శిఖామణి, నత్తా తిరుమలరావు, మణికే మాల్యాద్రి, పులి నాగరాజు, చుండూరు శ్రీను, షేక్ సలాం, దువ్వూరి రమేష్, జడ రవీంద్ర, పల్లె రఘుబాబు, మల్లికార్జున, ఉచ్చులూరి సుబ్బారావు, కరేటి ప్రభాకర్, కందల వెంకట్రావు, ముచ్చు ఓంకారం, ముచ్చు వేణు, రుద్రబోయిన పోతురాజు ఉన్నారు.

జాషువా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

శ్మశానంలో చెట్లు తొలగింపు

ప్రజాశక్తి-కందుకూరు :ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు సూచనల మేరకు కందుకూరు పట్టణంలోని శ్మశాన వాటికలో పిచ్చి చెట్లు తొలగింపులో భా గంగా బుధ వారం ముత్యాల కుంట దగ్గర ఉన్న హిందూ శ్మశాన వాటికలో జెసిపి సహా యంతోటి పిచ్చి చెట్లు తొలగింపు చేపట్టారు. లో కాంట్రాక్టర్ వడ్డెల్ల రవిచంద్ర ,చవిడి బోయిన వెంకట కష్ణ ,అత్తింటి శివకష్ణ, మచ్చ మనోహర్, గుమ్మా శివ ,పేలా శ్రీనివాసులు, కొత్తూరు సుధాకర్ పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖాధికారి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ : నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ చల్లా చైతన్య బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజను మర్యాద పూర్వకస్త్రఇవ కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తన జాయినింగ్ రిపోర్టును కమిషనర్‌కు అందజేశారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలం కేటాయించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరుతూ జర్నలిస్టు మిత్రులు కలెక్టర్ ఒ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఐ మల్లికార్జున్ ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు కలెక్టర్‌ను కలిసి సమస్యలను వివరించారు.

దోబీ పోస్టులు భర్తీ చేయాలి

రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టుల భర్తీ కి ప్రభుత్వం చర్యలు తీసుకోని రజక యువతకు ఉపాధి కల్పించాలని ఎపి రజక వృత్తి దారుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం బిసిలకు ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రజక కుటుంబాల్లో ఉన్నటువంటి యువతీయువకులు ఉపాధి లేక గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలసలు వెళ్తున్నారన్నారు. పట్టణాల్లో ఇస్త్రీదారులుగా ఉంటూ చాలీచాలని జీతంతో చిన్న ఇరుకు గదుల్లో జీవనం సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తక్షణమే వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేసి రజక కుటుంబాల్లో ఉన్న యువత యువకులకు ఉపాధి కల్పించాలని. పట్టణ ప్రాంతాల్లో రజక వత్తిదారులకు మోడరన్ ధోబి గాడ్స్ అర్ధనావతనమైన యంత్రాలతో ఏర్పాటు చేయాలన్నారు. రజక వత్తిదారులకు 200 యూనిట్లు ఉచిత కరెంటు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 50 ఏళ్లకు పెన్షన్లు ఇవ్వాలని, ఎన్నికల సమయంలో చేసిన హామీలు అమలు జరిపేందుకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. చేతివత్తి సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, వత్తి సంఘాల సమన్వయ కమిటీ జిల్లా నాయకులు గుంజి దయాకర్, ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులు గుంట అంకయ్య, తదితరులు మాట్లాడారు. నాయకులు పొందేటి సురేంద్ర, దేవరకొండ వెంకటేశ్వర్లు, సిహెచ్ వేదవతమ్మ, రమణయ్య, వెంకటేశ్వర్లు, సాయి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎం భాస్కరయ్య

వ్యవసాయ కూలీల కడుపుకొట్టిన కేంద్రం

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-నెల్లూరు :పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ గ్రామీణ వ్యవసాయ కూలీల కడుపు కొట్టి ధనవంతులకు కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు లాభం చేకూర్చే విధంగా బడ్జెట్ కేటాయింపులు చేశారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంక మ రాజు విమర్శించారు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై డాక్టర్ బుధవారం సిపిఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశానికి ఇంకా అన్నం పెడుతూ పెడుతున్న వ్యవసాయ రంగాన్ని అందులో కీలకంగా ఉన్నటువంటి వ్యవసాయ కార్మికులను ,రైతులను, కడుపు మార్చే విధంగా కేటాయింపులు చేశారన్నారు. కూలీలకు అన్నం పెట్టే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం గత 10 ఏళ్లగా చిన్నచూపు చూస్తూ నామమాత్రంగా నిధులు కేటాయించడం బాధా కరమన్నారు. కేవలం ఈఏడాది 86000 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. పేదల కడుపు ఆకలి తీర్చే 'ఉపాధి' చట్టానికి నిధులు పెంచాలని, 200 రోజులు పని కల్పించి రూ.600 లు కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు

క్రీడా దినోత్సవం

నెల్లూరు :కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో 'శిక్షా సప్తాహ్' లో భాగంగా క్రీడా దినోత్సవం నిర్వహించారు. బుధవారం చేపట్టిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం భాస్కర్ రావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం లక్ష్యాలను మరింత విస్తృతం చేసే విధంగా ప్రభుత్వం 'శిక్షా సప్తాహ్' పేరుతో వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని 2020 లో ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 22 నుంచి 29 వరకు వారం రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్‌టి విద్యార్థులకు 'ఆధార్'

నెల్లూరు :ప్రభుత్వం చేపట్టిన ఆధార్ స్పెషల్ డ్రైవ్ సెంటర్లలో ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఎటువంటి డాక్యుమెంట్స్ లేకుండానే ఆధార్ నమోదు చేపట్టాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్ కోరారు. బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు ఆధార్ కార్డు లేక ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. బిటిఎ రాష్ట్ర కోశాధికారి ఆదినారాయణ, నగర అధ్యక్షులు ఖాజా రంతుల్లా ఉన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలలో

సత్తాచాటిన 'కృష్ణచైతన్య' విద్యార్థులు

సత్తాచాటిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

ప్రజాశక్తి -నెల్లూరు సిటీ : విక్రమ్ సింహపురి యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాలలో కష్ణ చైతన్య కళాశాల విద్యార్థులు అన్ని కోర్సులు, గ్రూపుల్లో సత్తాచాటారని యూనివర్సిటీ స్థాయిలో టాప్ మార్కులు సాధించి కళాశాల కీర్తిప్రతిష్టలు కళాశాల డైరెక్టర్లు ఆర్‌వి కృష్ణారెడ్డి, పి. రానా ప్రమోద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎస్‌సి గ్రూప్‌లో యూనివర్సిటీ టాప్ జి. శ్రీ హర్షిత 99.2, జి. శ్రీలక్ష్మి షేక్.కరిష్మా ఏ. పల్లవి పి.విజయలక్ష్మి ఎ. సౌజన్య లక్ష్మి ఎం. మహేశ్వరి 99, షేక్. అహేశ షేక్. జల్సా సుమయ డి.పింక్ చౌదరి యం. యూజిల్ఫ్ ఏ.శ్రావ్య బి.సాయి శ్రీజ ఎస్. డి. కరిష్మా పి. అఖిల షేక్.కరిష్మా 98, సాధించారన్నారు. బి.సి.ఎ., లో యూనివర్సిటీ టాప్ వి. హర్షిని 99, వి. సాయి హర్షిత ఎస్. కావ్య 98, కె.శివ కీర్తి కె. అమత 97 సి.హెచ్ ప్రత్యూష కె. తేజస్వి వి. కిషితసాయి కె.మానస 96% బి.లలిత జి. రేవతి పి వి ఎస్ సాయి లాస్య పి.సత్య పూజిత 95 సాధించారన్నారు. బీఎస్సీ లైఫ్ సైన్స్‌లో ఎస్ యశ్వంత్ 99, షేక్.సుమయ 98, ఎస్.తేజస్విని 97% బి.బి.ఏ.,లో యూనివర్సిటీ టాపర్ యమ్.లక్ష్మీ ప్రియ 92 కె. సుస్మిత 91% ఎస్.కె యాసిన్ డి. సూర్య వేణి టి. హారిక 90 సాధించారన్నారు. బికామ్‌లో కె భాగ్యలక్ష్మి94, సి.హెచ్.మోక్షిత డి.మేఘ వర్షిని 91, ఏ.జగదీష్ డి.సోనీ, షేక్. నీలోఫర్ 90 మార్కులు సాధించారన్నారు. 9 మంది విద్యార్థులకు 99 పైగా మార్కులు వచ్చాయన్నారు. 21 మంది విద్యార్థులకు 98కి పైగా మార్కులు, 152 మంది విద్యార్థులకు 95 పైగా మార్కులు, 428 మంది విద్యార్థులకు 90 పైగా మార్కులు వచ్చాన్నారు. 1014 మంది విద్యార్థులు 70 శాతంపైగా మార్పులు సాధించారన్నారు. విద్యార్థులకు సాంకేతికపరమైన అంశాలను విశదీకరిస్తూ నిరంతరం పర్యవేక్షణతో ఎంతటి ఘనవిజయాలను సొంతం చేసుకోగలిగామని ఆనందం వ్యక్తం చేశారు. తమ విద్యార్థులు విధితో పాటు స్పోర్ట్స్ సామాజిక సేవా కార్యక్రమాలు, బహుళ జాతి కంపెనీలలో ఉద్యోగాలు సాధించడం సంతోషానిస్తుందని డాక్టర్ ఆర్.వి.కష్ణారెడ్డి పి. రానా ప్రమోద్ రెడ్డి తెలిపారు. డీన్ బి సుధారాణి అడ్మిన్ డీన్ సి రామాంజనేయులు రెడ్డి ప్రిన్సిపల్ ఎస్ నాగయ్య వైస్ ప్రిన్సిపల్,అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణం కనిగిరి రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం వెనుక నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి అన్నప్రసాద వితరణ భవనానికి కందుకూరుకు చెందిన దోనవల్లి రామారావు ధర్మపత్ని లలిత కుమారి కుటుంబ సభ్యులు 11 సీలింగ్ ఫ్యాన్లను అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యుల చేతులు మీదుగా బహుకరించారు. అయ్యప్ప స్వామి సేవా సంఘం సభ్యులు నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు నేతల మద్దతు

ప్రజాశక్తి-కందుకూరు : ఎపిలో హింసాత్మక పాలన జరుగుతుందంటూ వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో నిరసన చేపట్టిన విషయం విధితమే. ఈ నిరసన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి మద్దతుగా కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్, శాసన మండలి సభ్యుడు తూమాటి మాధవరావు పాల్గొన్నారు.



ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి గ్రామంలో ఎంఆర్‌పిఎస్ జెండాను ఎగురవేయాలని ఆ సంఘం జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ పిలుపు నిచ్చారు. బుధవారం నగరంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయ్ కృష్ణమాదిగ ఆధ్వర్యంలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్‌పిఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు జులై నెలలో నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ రాష్ట్ర నాయకులు మంద పెంచలయ్య మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు కొపర్తి కొండయ్య మాదిగ ఉన్నారు.

కంప్యూటరీకరణ వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో కంప్యూటరీకరణ వేగవంతం చెయ్యాలని కలెక్టర్ ఒ.ఆనంద్ సహకారశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టరు అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం నిర్వహించారు. జెసి సేదు మాధవన్, డిసిఒ గుర్రప్ప, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, మత్స్యశాఖ జెడి నాగేశ్వరరావు ఉన్నారు.

ఘనంగా వనమహోత్సవం

నెల్లూరు : భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, నెల్లూరు క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభమైంది. రంగనాయకుల పేటలోని పి.ఎం.ఆర్. మున్సిపల్ హైస్కూల్ నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

చర్చి వార్షికోత్సవం

-తోటపల్లిగూడూరు : మండలంలోని తోటపల్లి పంచాయతీ కా మాక్షినగర్ లోని విమోచకుని ఆరాధన మందిరం వా ర్షి కోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఫెల్లోషిప్ చర్చ్ ఆఫ్ గాడ్ సం స్థ చైర్మన్ కుందవరం బాబి ఇమ్మా ను యే ల్ పర్యవేక్షణలో పాస్టర్ డి. విక్రమ్ అధ్యక్షతన జ రిగిన ఈ వార్షి కోత్సవ వేడుకలకు ప్ర సంగీకులుగా పాస్టర్ కె.జాన్ ప్రసాద్ హాజరయ్యారు.

ఎన్‌సిసికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణంలోని స్థానిక పామూరు రోడ్డులోని బిఆర్ అక్స్‌ఫర్డ్ ఒలంపి యాడ్ స్కూల్లో 34-ఆంధ్ర బెటాలియన్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో బుధవారం ఎన్‌సిసి సెలక్షన్స్ బుధవారం జరిగాయి. సుబేదార్ మేజర్ పుష్పరాజ్, హవల్దర్- శ్రేష్ట, మాజీ హవల్దర్ లక్ష్మీనరసింహారావు ల పర్యవేక్షణలో అర్హత కలిగిన బాలబాలికలను ఎంపిక చేశారు. బిఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు మాట్లాడుతూ ఎన్‌సిసి లో చేరడం వలన విద్యార్థులకు క్రమశిక్షణ అంకితభావం అలవడతాయన్నారు. విద్యా సంస్థల కరస్పాండెంట్ బి.వెంకటేశ్వర్లు,డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు, బి.నరేంద్ర బాబు,స్కూల్ డీన్ రామారావు,ప్రిన్సిపాల్స్ మల్లికార్జున, నజీర్,సునీత పాల్గొన్నారు.



ఎన్‌సిసికి ఎంపికైన విద్యార్థులు

క్రమశిక్షణతో సంస్థ అభివృద్ధి

ప్రజాశక్తి-కావలి : ఏ సంస్థ అభివృద్ధి సాధించాలన్నా క్రమశిక్షణ ముఖ్యమని జిల్లా ప్రజా రవాణాధికారి (ఆర్‌టిసి రీజియన్ మేనేజర్) జి విజయరత్నం పేర్కొన్నారు. బుధవారం ఆయన కావలి డిపోలోని పలు విభాగాలలో తనిఖీలు నిర్వహించారు. ఆయన జిల్లా అధికారిగా విధులు చేపట్టిన తరువాత మొదటిసారి కావలి డిపోకు రావడంతో పలు ఆర్‌టిసి సంఘ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. తనిఖీల అనంతరం డిపో గ్యారేజ్, ఆవరణంలో నిర్వహించిన ఉత్తమ ఉద్యోగుల అభినందన సభలో ఆయన పాల్గొని, అత్యధికంగా ఇంధన పొదుపు సాధించిన డ్రైవర్లు బాలకోటయ్య, చెంచయ్యలను సత్కరించి, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్భుత విజయాల వెనుక రహస్యమేమీ లేదని, కేవలం ఇష్టంతో కష్టపడి పనిచేయడమేనన్నారు. ఉద్యోగులందరూ శ్రద్ధతో మనస్ఫూర్తిగా పనిచేసి ఆర్‌టిసి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. త్వరలో కావలి డిపోకు కొత్తబస్సులు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కావలి డిపో మేనేజర్ రాఘవ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ (ట్రాఫిక్) ఎం.రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎన్‌కె.ఖాజా మొహిద్దీన్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్ పాల్గొన్నారు.

అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళులు

ప్రజాశక్తి-మర్రిపాడు : గ్రంథాలయాలను స్థాపించి వాటి అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసి, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తుడిగా, పత్రికా సంపాదకుడిగా విశేష సేవలందించిన అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పద్మలత గ్రంథాలయ భాండాగారి నారాయణరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటరమణయ్య జీవిత విశేషాలను, గ్రంథాలయాలకు ఆయన చేసిన కృషిని, పుస్తక పఠనం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి విద్యార్థి బాల్యం నుండి పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా సంస్కృతి, సాంప్రదాయాలు, దేశ చరిత్ర, పురాణాలు, ఇతిహాసాలు, మహనీయుల చరిత్రలు తెలుసుకోవడమే కాకుండా విలువైన జ్ఞాన సంపదను ఆర్జించి ఆయా రంగాలలో నైపుణ్యం పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి సురక్ష యోజన పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని లీడ్‌బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో పట్టణ సమైక్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో 8 బ్యాంకుల నుంచి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లీడ్‌బ్యాంక్ డిస్ట్రిక్ మేనేజర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ 18-49 సంవత్సరాల వయస్సు వారికి ప్రధానమంత్రి జీవనజ్యోతి యోజన స్కీమ్, 18-70 సంవత్సరాల వయస్సు ఉన్న వారికి ప్రధానమంత్రి జీవన జ్యోతి సురక్ష యోజన పథకాల గురించి వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. పిఎం జీవనజ్యోతి యోజన స్కీమ్ కింద సంవత్సరానికి రూ.436 కడితే రూ.2లక్షలు బీమా వర్తిస్తుందని, ఇది సహజ మరణమైనా, ప్రమాదమరణమైనా వర్తిస్తుందన్నారు. అదేవిధంగా పిఎం జీవనజ్యోతి సురక్ష యోజన పథకం కింద రూ.20 కడితే ప్రమాద మరణం సంభవిస్తే రూ.2లక్షలు పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో డిపిఎం సురేంద్రబాబు, కమిషనర్ ఫజులుల్లా, సిఒ మాధవి, ఆర్‌పిలు, ఎస్‌ఎల్‌ఎఫ్‌ఒబిలు పాల్గొన్నారు.

పేదలకు చీరలు వితరణ

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ నివాసులు నాగలక్ష్మమ్మ జ్ఞాపకార్థంగా వారి మేనల్లుడు, సంయుక్త సేవాసంస్థ సభ్యులు డాక్టర్ కె.సుబ్బారెడ్డి - డాక్టర్ పి.పద్మజ దంపతులు సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో బుధవారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా పేదలకు చీరలు వితరణ చేయించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ డాక్టర్ సుబ్బారెడ్డి వారి మేనత్త నాగలక్ష్మమ్మ జ్ఞాపకార్థంగా పేదలకు చీరలు వితరణ చేయించడం సంతోషంగా ఉందని తెలిపారు. సంయుక్త సేవాసంస్థ ద్వారా దత్తత తీసుకొని చదివిస్తూ అవసరమైన అన్ని ఏర్పాట్లను చూస్తూ మానవత్వాన్ని చాటుకున్నారని తెలిపారు.

పలు పంచాయతీల్లో గ్రామసభలు

ప్రజాశక్తి-సీతారామపురం : పంచాయతీలలో చేయాల్సిన అభివృద్ధి పనులు వాటి తీర్మానాలపై చర్చించి సమస్యల పరిష్కారం వైపు ప్రణాళికలు సిద్ధం చేసుకునేలా స్థానిక సర్పంచుల అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులు మండలంలోని చిన్నగానవల్లి, బాలాయపల్లి, దేవరాజు సూరాయపల్లి, దేవిశెట్టిపల్లి, సింగారెడ్డిపల్లి, ఓబుల్ రెడ్డిపల్లి దేవమ్మ చెరువు పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో పంచాయతీలో చేపట్టాల్సిన పనుల గురించి ప్రజల నుండి అభిప్రాయ సేకరణ చేసి వాటి తీర్మానాలు గ్రామసభలో ప్రవేశపెట్టి ఆమోద ముద్ర వేశారు. అనంతరం గ్రామ సభ నిర్వహణ ఫోటోలను నేషనల్ పంచాయతీ పోర్టల్లో అప్‌లోడ్ చేయడం జరిగిందని పంచాయతీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంపై శిక్షణ

ప్రజాశక్తి-ఉదయగిరి : పొదలకూరు మండలం డేగపూడి గ్రామంలో రైతులకు ఆత్మ వారి సౌజన్యంతో సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శిక్షణ జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ అధికారి యు.గీతాకుమారి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటలు లేని సమయంలో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుకుంటే అధిక దిగుబడులు సాధించి ఖర్చులు తగ్గించుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువులు వాడకం వల్ల జరిగే అనర్థాలను కృషి విజ్ఞాన కేంద్రం, శాస్త్రవేత్త సేద్య విభాగం డాక్టర్ కె.శిరీష్‌కుమార్ రెడ్డి వివరించారు. భూమిలో రసాయన ఎరువులు ముఖ్యంగా భాస్వరం నిల్వలు పెరిగిపోయి మొక్కల్లో సూక్ష్మ పోషక లోపాలు కనిపిస్తున్నాయని తెలిపారు. అలాగే ఇఫ్కో జిల్లా సేల్స్ మేనేజర్ వి.లక్ష్మి నారాయణ మాట్లాడుతూ మార్కెట్లో కొత్తగా నానో యూరియా ప్లస్, నానో డి.ఎ.పి వాడకం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాగరిక, డీలర్లు ఎరువులు, నెట్ రాక్స్ వాడాలని తెలిపారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-కావలి : కావలి సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ ఎం.శోభ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రామ్మూర్తిపేట ప్రాంతంలో ఉన్న హౌసింగ్ ఫైనాన్స్ కార్యాలయం దగ్గర న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ మెంబర్, న్యాయవాది ఇసకల సాయి ప్రసాద్ మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ వాడకం వల్ల ప్రాణ రక్షణ, తలకు గాయాలు వంటి వాటిని రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ సంస్థ సిబ్బంది, మోటార్ సైకిల్ ప్రయాణికులు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలి

ఆత్మకూరు, అనంతసాగరం మండలాల్లో వినతిపత్రాలు అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

రాష్ట్రంలో అమలు జరిపిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ఆ మేరకు నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపిడిఒ, ఎంఇఒలకు యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని, పనిభారంతో సమస్యలు పరిష్కారం కాక వారిలో అసంతృప్తి తీవ్ర స్థాయిలో ఉందన్నారు. జిఒ117 రద్దుచేసి జిఒ ఎంఎస్ నెంబర్ 55 23-04-2021 తేదీ ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు 1 నుండి 5వ తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని కోరారు. సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలన్నారు. హైస్కూల్‌లో రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి మినహాయించి, పనిభారం తగ్గించాలని కోరారు. ఒక కిలోమీటర్ పైబడిన విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, స్థానిక ప్రాంతాల పరిస్థితులను బట్టి సవరించాలన్నారు. మున్సిపల్ టీచర్ల పిఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, గిరిజన ప్రాంతాలలో ప్లస్ టు స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ప్రయివేట్ సమయంలో మరణించిన మోడల్ హైస్కూల్ టీచర్ల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని, ఎయిడెడ్ పాఠశాలల ఖాళీలను భర్తీ చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. మినిమం టైంస్కేల్ ఉపాధ్యాయుల సర్వీస్‌లను రెగ్యులర్ చేయాలని, ప్లస్‌టు పాఠశాలల్లో పిజిటి పోస్టులకు ప్రమోషన్లు ఇవ్వాలని, పాఠశాలలకు రావాల్సిన అన్నిరకాల గ్రాంట్లు మంజూరు చేయాలన్నారు. విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలని, వేసవి సెలవులలో నాడు - నేడు ప్లస్ టు తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవు మంజూరు చేయాలన్నారు. ఈ డిమాండ్లతో ఇవాళ ఎంపిడిఒ, తహశీల్దారు కార్యాలయాలలో వినతిపత్రం అందజేసినట్లు యుటిఎఫ్ నాయకులు తెలియజేశారు.

ప్రజాశక్తి-అనంతసాగరం : యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం విద్యారంగ సమస్యలపై తహశీల్దార్ ఎంపిడిఒ, ఎంఇఒలకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ప్రాథమిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే 117 జిఒను రద్దు చేయడం, ఇంగ్లీషు, తెలుగు మీడియాలలో బోధన, ఒకే సిలబస్ - ఒకే పరీక్షా విధానం అమలు పరచాలని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వుద్దిబోయిన వెంకటేశ్వర రెడ్డి, షేక్.సాధిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి హెచ్.మోహన్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యాశాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.వెంకటేశ్వర్లు, కె.మహబూబ్‌బాషా, షేక్.రహంతుల్లా, ఎస్.తిరుపతయ్య, తాజుద్దీన్, ఆర్.కృష్ణయ్య, ఎన్.సుబ్బరాయుడు, మస్తాన్, ఎస్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సేవాసంస్థల అధ్యక్షులు

ప్రజాశక్తి-ఉదయగిరి

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షులు కలిశారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును వారు కలిసి ఈ సందర్భంగా వారు స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఆర్గానిక్ ఫార్మింగ్ పద్ధతులను వివరించారు. స్వచ్ఛంద సేవాసంస్థలను, ఆర్గానిక్ పద్ధతులు ద్వారా రైతులను, చైతన్యవంతులు, ఎపిఒలను చేయడానికి భాగస్వామ్యం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఆయన సమస్యను వెంటనే పరిష్కారం చర్యలు చేపడతామని హామీనిచ్చారన్నారు. కార్యక్రమంలో పి.వి.రమణయ్య, సెక్రెటరీ, పికె ప్రకాష్, రాష్ట్ర స్వచ్ఛంద సేవాసంస్థల సమాఖ్య సలహాదారు, మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్, కార్యవర్గ సభ్యులు, వెంకట శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పాలి

ప్రజాశక్తి-కావలి

"పాఠశాల దశలోనే నైతిక, సామాజిక, జీవిత విలువలను నేర్పాలని, మైనర్ బాలురు తప్పుదోవ తొక్కకుండా చూడాలనే ఉద్దేశంతో బుధవారం కావలి విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో కావలి ఉమెన్స్‌ఫోర్స్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.డి. చౌదరి అధ్యక్షత వహించారు. పాఠశాల పూర్వపు ప్రధానోపాధ్యాయినీ, కావలి ఉమెన్స్ ఫోర్స్ కన్వీనర్ సి.శారద ప్రధానవక్తగా మాట్లాడుతూ అత్యంత విలువైన మానవ జీవితంలో బాల్యం పునాది వంటిదన్నారు. బాల్యంలో తల్లిదండ్రులు ఇంటివద్ద, ఉపాధ్యాయులు పాఠశాలల్లో విద్యతోపాటు నైతిక, సామాజిక, జీవిత విలువలను నేర్పడం విద్యార్థులకు పరిపూర్ణ వ్యక్తిత్వం అలవడేందుకు, ఉత్తమ మార్గంలో పయనినించి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ఎంతో అవసరమన్నారు. ఇక నుండి రోజుకో విద్యాలయంలో ఇలాంటి విలువల గురించి బాలబాలికలు యువతకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఫోర్స్ సెక్రెటరీ, జమాయతే ఇస్లామి ఇ హింద్ సభ్యురాలు ఎస్‌కె.ఫాతిమా, బాల్యదశలో ఏమి చేయవచ్చో, అది చెయ్యడం, ఏమి చేయరానివో వాటికి దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజూ దినచర్య రాసుకునే మంచి అలవాటు నేర్చుకుంటే ఏరోజుకారోజు ఆత్మపరిశీలన చేసుకుని మంచిమార్గంలో పయనించాలని తెలిపారు. కార్యక్రమంలో ఫోర్స్ సభ్యులు నూర్జహాన్‌, బుశ్రా, సుమయ్య, పాఠశాల ఉపాధ్యాయులు జి.కల్యాణి, శ్రీహరి, శ్రీనివాసులురెడ్డి, షరీఫ్, దేవకి, పి.ఇ.టి. కె.శివకుమార్ రెడ్డి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఎఇ సస్పెన్షన్

ప్రజాశక్తి-సంగం : మండలంలో సిమెంట్, స్టీల్ అక్రమాలపై అధికారులు జరిపిన విచారణలో 1829 బ్యాగుల సిమెంట్, 17495.40 కేజీ స్టీల్ గల్లంతయినట్లు గుర్తించారు. ఆ మేరకు అక్రమాలు జరిగాయని నిర్ధారించి హౌసింగ్ ఎఇ కరీముల్లాను కలెక్టర్ ఒ.ఆనంద్ సస్పెండ్ చేశారు. ఎఇ ఇన్‌ఛార్జి బాధ్యతలు డిప్యూటీ ఇంజనీర్ ముక్తార్‌బాషాకు అప్పగించారు.

రామచంద్ర మరణం తీరనిలోటు

ప్రజాశక్తి-ఉదయగిరి : టిడిపి ఎంపిటిసి మాదాల రామచంద్ర ఆకస్మిక మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం దుత్తలూరు మండలం నర్రవాడ ఎంపిటిసిగా రామచంద్ర పేద ప్రజలు చేసిన సేవలు మరుపురానివని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు వారి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని గిరిజన కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ గిరిజన కాలనీలో 80 కుటుంబాలు ఉన్నాయని వారి తాగడానికి మంచి నీళ్లు లేక అక్కడ ఉండే చేతి పంపు నుండి వచ్చే సుద్ధనీరు తాగి అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. వెంటనే మంచి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా పెన్నానీరు అందించే ప్రయత్నం చేస్తున్నామంటున్నారు కానీ టెండర్ పాడిన కాంట్రాక్టర్ మాత్రం సగం వరకు పైప్‌లైన్ వేసి మధ్యలో వెళ్లి పోయారన్నారన్నారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చొరవ తీసుకొని పైప్‌లైన్ పూర్తి చేసి గిరిజన కాలనీ ప్రజలకు అనంతసాగరంలోని మిగతా ఏరియాలకు పెన్నానీరు అందించాలన్నారు. అలాగే ఎస్‌టి కాలనీలోని వంక పక్కన నివసిస్తున్న వారికి కరెంట్ స్థంభాలు లేక

సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్న గిరిజన మహిళలు

పోవడంతో కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విష పురుగులతో కలిసి జీవిస్తున్నారని, అధికారులు కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి కరెంటు సౌకర్యం కల్పించాలని కోరుతున్నామన్నారు. శ్మశానం లేక ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కాలనీలో ఉండే సమస్యల వినతి పత్రం ఎంపిడిఒకు అందజేశారు. కార్యక్రమంలో అనంతసాగరం గిరిజన కాలనీ సిపిఎం కార్యదర్శి వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ

ప్రజాశక్తి-మర్రిపాడు

మాట్లాడుతున్న ఎపిఒ వెంకట నారాయణ

మండలంలోని నందవరంలో నరసింహులు పొలం కుంట వద్ద జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను బుధవారం ఎపిఒ వెంకట నారాయణ తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో ఆయన సమావేశమై మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి దినసరి కూలి రూ.300 పొందాలని, జాబ్ కార్డుల్లో ఒకరి పేరు మీద మరొకరు రాకూడదని, జాబ్ కార్డులో ఉన్నవారే ఉపాధి పనికి రావాలని, ఉదయం 6గంటల నుంచి 11గంటల లోపు పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలతో పాటు మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేశారని తెలిపారు. గత నెలలో ఉపాధి కూలీల నగదు త్వరలోనే మీ అకౌంట్లో జమ కానున్నయన్నారు. పంచాయతీలో ఎస్‌సి, ఎస్‌టిలతోపాటు ఉపాధి జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఉపాధి పనులకు రావాలన్నారు. ఉపాధి హామీ కూలి పనులకు వచ్చే ప్రతి ఒక్కరూ ఉపాధి వేతనాలు జమ కోసం పోస్ట్ ఆఫీస్‌లో అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని అందులో నగదు సురక్షితంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ షేక్.ఖాదర్ బాషా, కూలీలున్నారు.

ఇసుక రీచ్‌లో పరిశీలన

ప్రజాశక్తి-సంగం

సంగంలోని ఇసుక రీచ్‌ను ఇరిగేషన్ ఎస్‌ఇ కృష్ణమోహన్, మైనింగ్ అధికారులు సందర్శించారు. ప్రభుత్వం నూతన ఇసుక విధానం అమలు చేస్తున్న నేపథ్యంలో రీచ్ వద్ద వసతులు పరిశీలించారు. డీ సిల్టింగ్ విధానంలో ఇసుక తవ్వకాలు జరిపేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వర్షాకాలంలో సైతం ఇసుక కొరత తలెత్తకుండా డ్రెజ్జింగ్ విధానంలో ఇసుక తీసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లాలో నెల్లూరు, సూరాయిపాలెం, సంగం రీచ్‌లలో ఇసుక డీ సిల్టింగ్ చేసేందుకు గుర్తించామన్నారు. వారంలో అన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని తెలిపారు. ఇరిగేషన్ ఇఇ నాగరాజు, డిఇ భాస్కర్ రెడ్డి, ఎఇ కృష్ణ, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

తపాలా లైఫ్ ఇన్సూరెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని సింగన పల్లిలో భారత తపాలా వ్యవస్థలో లైఫ్ ఇన్సూరెన్స్, గ్రామీణ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రాముఖ్యతను గూర్చి ఉదయగిరి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సాయికృష్ణ గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఇన్సూరెన్స్ కంపెనీలు ఇంటి వద్దనే చేస్తాయి కానీ క్లైమ్ సెటిల్‌మెంట్ ఇంటి వద్దకు వెళ్లి ఇచ్చిన ఘనత తపాలా శాఖకే దక్కుతుందన్నారు. తపాలా శాఖలో ఇన్సూరెన్స్ చేసుకొని కొన్ని అనివార్య కారణాల వల్ల మరణించిన వారి కుటుంబ సభ్యులకు తక్కువ కాల పరిధిలో క్లైమ్ పూర్తి చేసి బుధవారం వారి ఇంటి వద్దనే అందించామని తెలిపారు. ఇటీవల కాలంలో తపాలా శాఖ చాలా మార్పులు చేసిందని, ప్రతి ఇంటిలోనూ తపాలా ఖాతా ఉండేలా ప్రయత్నిస్తున్నామన్నారు. తపాలా శాఖలో ఆర్‌డిఎస్, బిఎస్‌ఎస్‌వి, ఎంఎస్‌ఎస్‌సి, పిపిఎఫ్, ఆర్‌పిఎల్ఐ, పిఎల్ఐ, జిఎజి, ఐపిపిబి, కెవిపి, ఎన్‌ఎస్‌సి సేవింగ్ ఖాతాలను ప్రతిఒక్కరూ

సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం నుండి వచ్చే పథకాలకు సంబంధించి ఏ నగదైనా ఐపిపిబి అకౌంట్‌కు వచ్చేలా ఐపిపిబి కలిగి ఉంటే ఇంటి వద్దనే పోస్ట్‌మ్యాన్ ద్వారా నగదు తీసుకోవచ్చన్నారు. గ్రామ సర్పంచ్ రాచాల గీత, వైసిపి నాయకులు రాచాల శ్రీనివాసులు యాదవ్, నందిపాడు సబ్ పోస్ట్‌మాస్టర్ రేవూరు పెంచల నరసయ్య, తిమ్మా నాయుడుపేట సబ్‌స్టిట్యూట్ బిపిఎం పెంచల నరసింహులు, ఎబిపిఎం ఖాజారహంతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ ఏర్పాటుకు భవనం పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరులో బిసి వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్ ఏర్పాటుకు అధికారుల సన్నాహకాలు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి వై.వెంకటయ్య ఆత్మకూరు ఆర్‌డిఒ మధులత, స్థానిక అధికారులతో కలిసి పట్టణంలో బిసివెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసేందుకు భవనాలను పరిశీలించారు. మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు నియోజకవర్గంలో బిసి వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ హాస్టల్ ప్రారంభానికి సిద్ధం

భవనాలను పరిశీలిస్తున్న అధికారులు

చేస్తున్నట్లు దానికి అనువైన భవనం కోసం తాము పరిశీలిస్తున్నట్లు జిల్లా అధికారి వై.వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ సంక్షేమ శాఖ అధికారిణి ఎం.శ్రీదేవి, రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఆత్మకూరు టిడిపినేత చల్లా రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతో పంచాయతీ అభివృద్ధి

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలం లోని గౌరవరంలో సర్పంచ్ సుబ్బారావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ లోని ప్రజలు ఐకమత్యంగా ఉంటే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. పంచాయతీలో తాగునీరు, రోడ్లు, మంత్రి సహకారంతో నిర్మించుకోవచ్చన్నారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. గ్రామంలోని ప్రతిఒక్కరూ మరుగు దొడ్లు వాడాలని బహిర్భూమికి వెళ్లడం వల్ల వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-కావలి

కావలి ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు 30వ వార్డులో ఉన్న పాత బోర్లను రిపేర్ చేయించి, కొత్త బోర్లుగా రూపొందించారు. ఇందులో భాగంగా టిడిపి వార్డ్ ఇన్‌ఛార్జి గాదంశెట్టి వేణుగోపాల్ దగ్గర ఉండి బోర్లు రిపేరు చేయించి తాగునీరు వార్డ్ ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎంఎల్‌ఎ సహకారంతో కార్యక్రమంను నిర్వహించారు. 30వ వార్డు ప్రజలు కోరగా వెంటనే స్పందించిన ఇన్‌ఛార్జి, ఎంఎల్‌ఎతో మాట్లాడి బోర్లను వెంటనే రిపేరు చేయించడం శుభ పరిణామం అని వార్డ్ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వార్డ్ నాయుకులు జనసేన నాయకులు గాధంశెట్టి రవి, పెసల పవన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



పీర్ల ఉత్సవాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-ఉదయగిరి

పట్టణంలోని దేవాలాల గడ్డ గుంత బజార్ వీధులలోనీ పీర్ల ఉత్సవాలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకట రెడ్డి బుధవారం ఆర్థిక సాయం తమ ట్రస్టు సభ్యులతో అందజేశారు. దేవలాలగడ్డ గుంతబజార్ పీర్ల చావులకు ఐదువేల రూపాయలు విరాళంను మన ఫౌండేషన్ సభ్యుల ద్వారా నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు అభినందలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు గాజుల బాబు అర్షద్ మున్న జఫూర్ నౌషద్ అఖిల్ పాల్గొన్నారు.

తహశీల్దార్ నెహ్రూబాబుకు సన్మానం

ప్రజాశక్తి-ఉదయగిరి : బదిలీపై వెళ్తున్న తహశీల్దారు నెహ్రూబాబుకు కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎన్నికల సమయంలో బదిలీపై వచ్చిన ఆయన ఎన్నికలు ముగియడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో ఎన్నికలపై వచ్చిన తహశీల్దారు బదిలీల్లో భాగంగా ఆయన బాపట్ల జిల్లాకు తిరిగి వెళుతుండడంతో కార్యాలయ సిబ్బంది శాలువా పూలమాలలు బొకేలతో సత్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నెహ్రూబాబు మాట్లాడుతూ ఎన్నికల విధులు సజావుగా జరిగేందుకు సిబ్బంది అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. విధి నిర్వహణలో రెవెన్యూ ఉద్యోగులు ఐక్యంగా ప్రజలకు సేవలందించి మంచిపేరు పొందారన్నారు. డిప్యూటీ తహశీల్దార్ జహీర్, సీనియర్ అసిస్టెంట్ సంధాని, ఎఎస్‌ఒ సుమ, సర్వేయర్ రవికుమార్, సివిల్ సప్లై సీనియర్ అసిస్టెంట్ లలితమ్మ, విఆర్‌ఒలు జాఫర్, అంజాద్, వెంకటరమణ, మస్తాన్, దయానా, సిఒలు నరసింహులు, అలీమ్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి-కావలి : ఎన్నికల బదిలీల్లో భాగంగా ఎన్నికల సమయంలో కావలి తహశీల్దార్‌గా విచ్చేసిన నగేష్ తిరిగి బదిలీ అయ్యి, కావలి నుండి వెళ్లిపోతున్న సందర్భంగా బుధవారం కూటమి నేతలు ఆయనను సత్కరించారు. తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి శాలువాతోబ సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, చవల రామకష్ణ, గాదంశెట్టి వేణుగోపాల్, పల్లపు మోహన్, శివ, వేణు, జనసేన పట్టణ అధ్యక్షుడు బొబ్బ సాయివిఠల్, రామాంజనేయులు, వెంకటాద్రి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ తీరుపై సిఎం స్పందించాలి

- సామాజిక కార్యకర్త చాకలికొండ శారద

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర రాజధాని కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు సిఎం జోలె పట్టుకుని వెళ్తే, కేంద్రం షూరిటీ ఇస్తుందని, రాష్ట్రాలపై ఆధారపడి, మనుగడ సాగిస్తూ ఆ రాష్ట్రాలనే తన ఆధీనంలోకి దిగజార్చే విధంగా ఉన్న కేంద్ర బడ్జెట్‌పై ఎపి ముఖ్యమంత్రి గళం విప్పాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, సామాజిక, మహిళా కార్యకర్త చాకలకొండ శారద వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి కేంద్రం చేసే దురన్యాయంపై ప్రజలు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఎప్పటిలానే "బడా కార్పొరేట్ల కోసం - బడా కార్పొరేట్లతో - బడా కార్పొరేట్ల " బడ్జెట్ అని ఇది అని మరోసారి రుజువైందన్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అధికధరలు, అసమానతలు, పంటలకు గిట్టుబాటు ధరలు, రైతు రుణమాఫీ వంటివి దేశంలో ప్రధాన సమస్యలు కాగా, వీటికి వేటికీ పరిష్కారం ఏ మాత్రం చూపక జాగ్రత్తగా ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారన్నారు. కొనుగోలు దారులకు ప్రభుత్వాలు సహకరించేది 'సంక్షేమ రాజ్య థియరీ' 'అమ్మకందారులకు ఆర్థిక సహకారాన్ని అందించాలని చెప్పేదే 'ట్రికిల్డౌన్ థియరీ' ఈ రెండు థియరీలు బూర్జువా పాలనా విధానమనే నాణేనికి 'బొమ్మా బొరుసు' వంటివన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని కోసం రూ.15వేల కోట్లు ఆర్థికసాయం చేస్తున్నట్లు మీడియాల్లో ఆర్భాటంగా వచ్చిందని, ఇది పూర్తి అసత్యమన్నారు. నిజానికి కేంద్రం మన రాజధాని కోసం ఎలాంటి కేటాయింపులూ చేయలేదన్నారు. రాష్ట్రప్రజలు ఎన్నుకున్న ముఖ్య మంత్రి అప్పుల కోసం రుణదాత ఏజన్సీల వద్దకు జోలె పట్టుకుని వెళ్తే ఆంధ్రప్రదేశ్ పాలక కూటమిపై ఆధారపడి మనుగడ సాగించే మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి కల్పించిన దుస్థితి ఇదన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి 'ప్రత్యేక హోదా' ప్రసక్తి లేదన్నారు. పోలవరం ముంపు బాధితుల ప్యాకేజీలు లేవన్నారు. విశాఖఉక్కు మాటే లేదని, రైల్వే జోన్ ఊసేలేదన్నారు. ఉత్తరాంధ్ర రాయలసీమలకు ప్యాకేజీలు లేవన్నారు. రైల్వేజోన్ మాటలేదన్నారు. కేంద్ర విద్యా సంస్థల స్థాపన సంగతే లేదని, విజయవాడ, విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టుల గురించి ఏమీ చెప్పలేదన్నారు. విభజన చట్టం అంశాలకు కట్టుబడి ఉన్నామని పదేళ్లుగా పాడినపాటే పాడుతున్నదే గానీ మోడీ ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. ఉత్తుత్తి హామీలతో రాష్ట్ర ప్రజల కడుపునింపే బుద్ధినే ప్రదర్శిస్తుందన్నారు. ఇచ్చిన హామీలనే మళ్ళీమళ్ళీ ఇస్తూ మోసగిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు రాబట్టి, ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చి చూపాలని శారద కోరారు.

తహశీల్దారు దంపతులకు సన్మానం

ప్రజాశక్తి-సంగం

సంగం తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం తహశీల్దార్ రమాదేవి దంపతులను సిబ్బంది ఘనంగా సన్మానించారు. బదిలీలలో భాగంగా సంగం నుండి ప్రకాశం జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా తహశీల్దార్ దంపతులను కార్యాలయ సిబ్బంది శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సంగం తహశీల్దార్‌గా ఆమె చేసిన సేవలను సిబ్బంది కొనియాడారు. తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ తాను పనిచేస్తున్న సమయంలో తనకు సహకరించిన సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగార్జున రెడ్డి, ఎంఇఒలు జానకి రామ్, మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, JAKKAM SRIHARI REDDY S/o. JAKKAM MALAKONDAIAH, my name mentioned in my Wife Passport SRIHARI JAKKAM (Old Name) Passport No. B8544649, Residing at MIG-2-39,Housing Board Colony, Kallurupalle, Nellore, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as **JAKKAM SRIHARI REDDY**(New Name) S/o. JAKKAM MALAKONDAIAH.